క్లుప్తంగా

ఆకట్టుకున్న ద్రౌపది కల్యాణమహోత్సవం

కలకడ : మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన శ్రీ ద్రౌపది కల్యాణ మహోత్సవం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ధర్మకర్తలు రామయ్య, వెంకట్రమణ నాయుడుల ఆధ్వర్యంలో జరిపించిన కల్యాణ మహోత్సవాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మన్న దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఏటిగంగమ్మ తిరునాల

తంబళ్లపల్లె: మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ముత్రవారిపల్లె బస్టాప్‌వద్ద వెలసిన ఏటిగంగమ్మ తిరునాలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. పూజారి మదన్‌మోహన్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వెంకటశివారెడ్డికి డాక్టరేట్



మదనపల్లె : బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటశివారెడ్డి ఎస్‌సీఎస్‌వీఎంవీ, కాంచీపురం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. బిగ్ డేటా క్లౌడ్ డ్రివెన్ కంప్యూటేషనల్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఇంటలిజెన్స్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టం అనే అంశంపై పరిశోధనలు చేసినందుకు డాక్టరేట్ పొందారు. ఈయన పట్టణంలోని బీటీ కళాశాలలో చదువుకొని అక్కడే లెక్చరర్‌గా 26 ఏళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తూ హెచ్‌ఓడీ, ఓపెన్‌యూనివర్శిటీ కోఆర్డినేటర్, ఎస్‌ఎఫ్‌సీ ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహించారు.

బీఎస్పీ నుంచి పునీత్ తాత్కాలిక తొలగింపు

మదనపల్లె : యువతిపై లైంగిక వేధింపులకు సంబంధించి బీఎస్పీ నాయకుడు పునీత్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన నేపథ్యంలో పార్టీ నుంచి ఆయనను తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం బీఎస్పీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెండురోజులుగా పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన యువతిపై బీఎస్పీ నాయకుడు పునీత్ వేధింపులకు గురిచేశాడని పత్రికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో పార్టీ నుంచి తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కేసు విచారణలో ఉన్నందున వాస్తవాలు వెల్లడైన తర్వాత తదుపరి ఆదేశాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నేడు వలంటీర్ల ఇంటర్వ్యూలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి, తుమ్మరకుంట, సంపతికోట, మడుమూరులో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం యువశక్తి వలంటీర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ ప్రారంభించారు. బస్టాండులో నిత్యం ప్రయాణికులతో పాటు ఆర్టీసీ సిబ్బంది వస్తుంటారన్నారు. వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువశక్తి ఫౌండర్ గణేష్, జాఫర్,శశి, మోక్షిత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

కలికిరి: అంబేడ్కర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మదనపల్లి రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో సమావేశమైన నేతలు సంఘం గౌరవాధ్యక్షులుగా గుండ్లూరు జయరాం, జే.సత్యనాధం, అధ్యక్షుడిగా రవీంద్ర, ఉపాధ్యక్షులుగా రాజకుమార్, ఎన్టీ రమణ, ప్రధాన కార్యదర్శిగా సి.జయరాం, కార్యదర్శులుగా ఎ.సిద్దయ్య, ఎ.వసంతకుమారి, మంగమ్మ, రమణ, ఉప కార్యదర్శిగా పి.గణేష్, ట్రెజరర్‌లుగా నరసింహులు, జయారం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.రమణలను ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి నూతన కార్యవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా మట్టల ఆరాధన

మదనపల్లె సిటీ: మట్టల ఆరాధనోత్సవం ఆదివారం స్థానిక జేసీఎం చర్చిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని మిషన్ కాంపౌండ్ నుంచి క్రైస్తవులు ప్రత్యేకంగా పూలతో తయారు చేసిన మట్టలతో ఊరేగింపుగా క్రీస్తు గీతాలను ఆలపిస్తూ చర్చి వద్దకు చేరుకున్నారు. అనంతరం చర్చిలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ సంఘ కాపరి రెవ.డాక్టర్ సునిల్‌వరకుమార్ మాట్లాడుతూ ప్రజలను మోక్షమార్గంలో నడిపించేందుకు ప్రభువైన ఏసుక్రీస్తు నవాతార రూపంలో లోకానికి ప్రవేశించారన్నారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ములకలచెరువు: మండలానికి చెందిన క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసు ప్రభువు జెరుసలెం నగరానికి వచ్చే సమయంలో మట్టలతో స్వాగతం పలకడం జరిగిందని, అప్పటి నుంచి మట్టల ఆదివారాన్ని జరుపుకుంటున్నట్లు పాస్టర్ నాగేంద్రుడు, అబ్రహాం తెలిపారు. ఆదివారం సువార్త పాడుతూ మండల కేంద్రంలో ప్రదర్శన చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డి సాయంతో..

రైతులు, వ్యాపారులు ఖుషీ.. ఖుషీ

- వారపు సంత, దినసరి మార్కెట్‌కు రూ.15 లక్షలు చెల్లించిన ఎంపీ
- ఏడాది పాటు గేటు చెల్లించాల్సిన అవసరం లేదు
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న గేటు ఉచితం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, వ్యాపారులు

రైతులు, వ్యాపారులు వారంపు సంత, దినసరి మార్కెట్ రుసుం చెల్లించాలి. ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఉదార స్వభావంతో వారికి అండగా నిలిచారు. రూ. 15లక్షలు పీలేరు గ్రామ పంచాయతీకి చెల్లించి వారపు సంత, దినసరి మార్కెట్ గేటు భారం నుంచి విముక్తి కల్పించారు. దీంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యకం చేస్తున్నారు.



పీలేరు వారపు సంత

పీలేరు రూరల్ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి తన ఉదార స్వభావంతో రూ. 15 లక్షలు పీలేరు గ్రామ పంచాయతీకి చెల్లించి రైతులు, వ్యాపారులకు వారపుసంత, దినసరి మార్కెట్ గేటు భారం నుంచి విముక్తి కల్పించారు. ప్రతి ఏటా వారపుసంత, దినసరి మార్కెట్‌లకు వేలం నిర్వహించడం, ఆ వేలంలో గేటు వసూళ్ల హక్కును ఎవరో ఒకరు కాంట్రాక్టు పొంది ఏడాది పాటు గేటు వసూళ్లు చేసుకోవడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే రైతులు, వ్యవాపారులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న ఎంపీ గేటు భారం నుంచి విముక్తి కల్పించాలని సంకల్పించారు. దీంతో ఇటీవల జరిగిన వారపుసంత, దినసరి మార్కెట్ వేలంలో గేటు వసూళ్ల హక్కును శాంతకుమారి రూ. 15,01,000కు దక్కించుకున్నారు. ఈ మొత్తాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి తన నిధులతో గ్రామ పంచాయతీకి చెల్లించారు.

దీంతో ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు రైతులు గానీ, వ్యాపారులు గానీ ఎవరూ వారపుసంతకు, దినసరి మార్కెట్‌కు గేటు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో రైతులు, వ్యాపారులు తమకు గేటు భారంగా తగ్గించారని హర్షం వ్యక్తం ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. పీలేరు వారపు సంతకు పీలేరు మండలం తోపాటు చుట్టు పక్కల మండలాలైన కేవీపల్లె, కలకడ, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, పులిచెర్ల, సదుం, ఎర్రావారిపాళెం, సోమల, కలికిరి, చౌడేపల్లె, వాల్మీకిపురం, గుర్రంకొండ, మదనపల్లె మండలాల నుంచి వ్యాపారులు, రైతులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఎంపీ సహకారంలో వారపు సంతలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించడంతో రైతులు, వ్యాపారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పేద రైతులను ఆదుకోవడానికే



గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తాము పండించిన పంటలను వ్యయప్రయాసాలకు ఓర్చి వారపుసంతకు, దినసరి మార్కెట్‌కు తరలిస్తారు. అయితే వారికి గేటు చెల్లింపు భారంగా మారుతోంది. పేద రైతులను, వ్యాపారులను ఆదుకోవడానికి తమవంతు సాయంగా ఏడాదికి సరిపడా గేటుకు చెల్లించడం జరిగింది. రైతులు, వ్యాపారులకు ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.- **మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ**

ఎంపీ దాతృత్వం అభినందనీయం



ఉదార స్వభావంతో పేద రైతులు, వ్యాపారులను ఆదుకోవడానికి ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన దాతృత్వం అభినందనీయం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంపీ తన సొంత నిధులు వెచ్చించి రైతులు, వ్యాపారులకు కోసం గేటు చెల్లించారు. రైతులకు, వ్యాపారులకు ఎంతో ఊరట. వారపు సంతను మరింత అభివృద్ధి చేయడానికి తమ సహకారం ఉంటుంది.

- చింతల రామచంద్రారెడ్డి, పీలేరు ఎమ్మెల్యే

గేటు భారం తగ్గినట్లే



ప్రతి మంగళవారం వారపు సంత తోపాటు ప్రతి రోజూ పాత బస్టాండు దినసరి మార్కెట్‌లో ఆకు కూరల వ్యాపారం నిర్వహించడం జరుగుతోంది. 40 సంవత్సరాలుకు గేటు చెల్లిస్తూ వస్తున్నాను. ప్రస్తుతం వారపుసంతకు రూ. 350, దినసరి మార్కెట్‌కు రోజుకు రూ. 30 చొప్పున చెల్లిస్తున్నాను. అయితే ఎంపీ మిథున్‌రెడ్డికి తమకు భారం తగ్గించి ఆదుకున్నారు.

- ఆర్. రాజేశ్వరి, చిరువ్యాపారి, పీలేరు

ఎంపీకి రుణపడి ఉంటాం



ఏళ్ల తరబడి కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నాం. వ్యాపారం ఎలా ఉన్నా తప్పనిసరిగా గేటు చెల్లించాల్సి వచ్చేది. అయితే మా బాధలు అర్థం చేసుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి గేటు మొత్తం ఏడాదికి అయ్యే రుసుము మొత్తం పంచాయతీకి చెల్లించారు. తమకు గేటు భారం తగ్గించిన ఎంపీకి రుణపడి ఉంటాం. నాకు వారపు సంత భారం రూ. 600, దినసరి మార్కెట్‌కు రోజుకు రూ. 30 మిగిలిపోయినట్లైంది.

- ఎస్. ఖాదర్‌బాషా, చిరువ్యాపారి, పీలేరు

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పీలేరు రూరల్ : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు నడిచే ప్రాంతాల్లో హాల్‌టికెట్ కల్గిన పదో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. అలాగే చిత్తూరు రోడ్డు గురుకుల పాఠశాలకు ఒక బస్సు, సదుం గురుకుల పాఠశాలకు, కలికిరి గురుకుల పాఠశాలకు ఒక్కో బస్సు చొప్పున ప్రత్యేకంగా నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 5న అరుణాచలం గిరిప్రదక్షిణకు రెండు బస్సు సర్వీసులు నడుపుతున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వెలసిన శ్రీ పట్టాభి రాముల వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కరణం ప్రకాష్‌రావ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఆలయంలో రక్షా బంధనం, అంకురార్పణ, శేష వాహనం, మంగళవారం ధ్వజారోహణం, మోహినీ ఉత్సవం, సూర్య ప్రభ వాహనం, సింహ వాహనం, బుధవారం స్వామివారి కళ్యాణోత్సవం, గురువారం బ్రహ్మ రథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం , పార్వేటోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

బోయకొండ గంగమ్మ బోనాలు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె పంచాయతీ గుడ్రెడ్డిగారిపల్లె గ్రామ సమీపంలో బోయకొండ గంగమ్మకుకి భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం గుడ్రెడ్డిగారిపల్లె నుంచి పలువురు భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

కృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

మదనపల్లె : పట్టణంలోని బలిజకులస్థుల చిరకాల కోరిక శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ స్థాపనకు సంబంధించి ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఆదివారం బలిజసేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో మల్లికార్జున సర్కిల్‌లో క్రేన్ సహాయంతో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహాన్ని దిమ్మెపై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ బలిజసేవాసమితి అధ్యక్షులు బీపీఎల్.విజయకుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ... 30 ఏళ్లుగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటుచేసేందుకు బలిజ కులస్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వచ్చామన్నారు. ఎట్టకేలకు ప్రస్తుతం సంకల్పం కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందన్నారు. విగ్రహ ఏర్పాటుకు బలిజసేవాసమితి ఆధ్వర్యంలో టీటీడీ బోర్డ్ మెంబర్ పోకలఅశోక్‌కుమార్‌ను కలిసి తమ కోరికను ఆయనకు తెలిపితే స్పందించిన ఆయన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి తీసుకెళ్లారన్నారు. బలిజసేవాసమితి అధ్యక్షులు, కమిటీ సభ్యులతో సమావేశమైన ఎంపీ మిథున్‌రెడ్డి విగ్రహాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని చెప్పడమే కాకుండా అనువైన స్థలాన్ని ఎంపిక చేయాల్సిందిగా తమకే అవకాశం కల్పించారన్నారు. మల్లికార్జున సర్కిల్‌లో ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే నవాజ్‌బాషాను కోరితే ఆయన తక్షణమే పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయించారన్నారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటులో ఎంపీ, ఎమ్మెల్యే కృషి, సహకారం మరువలేనిదని, త్వరలోనే వారి ఆధ్వర్యంలో విగ్రహ ప్రారంభోత్సవ తేదీలను ఖరారుచేస్తామన్నారు. కార్యక్రమంలో బలిజసేవాసమితి సభ్యులు విజయలక్ష్మీ భాస్కర్, ఆవుల సూరి, డిపార్ట్‌మెంట్ శ్రీనివాసులు, రాజ్‌భవన్‌రాజా, నాగేంద్ర, ఆనంద్, ఉడుతానాగరాజ, లక్ష్మణ, సొక్కం వేణు, నాగరాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున సర్కిల్‌లో కృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు ఏర్పాట్లు చేసిన బలిజసేవాసమితి సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపించడానికే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సంగసముద్రం గ్రామంలో రాజంపే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై స్పందించి అప్పటికప్పుడు పరిష్కారం చూపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలవద్దకే అధికార యంత్రాంగాన్ని తీసుకొచ్చి వారి సమస్యలను వారి ఇళ్ల వద్ద పరిష్కరిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు, వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గతంలో జన్మభూమి కమిటి సభ్యులు ఇష్టానుసారంగా లబ్ధిదారుల ఎంపిక చేసేవారన్నారు. గత టీడీపీ హయంలో కేవలం ఒక పార్టీకే కొమ్ముకాసే వారికి ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం అలాంటి పద్ధతికి స్వస్తి పలికిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న చేస్తున్న మంచి పనులు శాశ్వతంగా ప్రజల గుండెల్లో నిలిచిపోతాయాన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

మండలంలోని సంగసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సుంకర మల్లికార్జున తమ అనుచరులతో కలసి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు వారు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విధానాలు నచ్చి పార్టీలో చేరుతున్నామని అన్నారు. పార్టీ గెలుపుకోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, మండల సచివాలయాల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటశివారెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీరమణ, మాజీ ఎంపీపీలు నక్కాచంద్రశేఖర్, మధుసూధన్‌రెడ్డి, జమీర్ అలీఖాన్, వైస్ ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్ విశ్వనాథ్, మస్తాన్‌రెడ్డి, రాధమ్మ, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మదనపల్లె అర్బన్, రూరల్ పరిధిలో 19 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఆదివారం ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, పర్యవేక్షకులు కలిసి పట్టణంలోని జెడ్పీ, హోప్ ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల గదులు, సూపర్‌వైజర్ల గదులతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే మంచినీరు,ఇతర సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు గదులు తెలుసుకునే విధంగా సిబ్బంది తగిన సూచనలు ఇవ్వాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని కోరారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: మండలంలో సోమవారం నుంచి జరిగే పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మూడు కేంద్రాల్లో 830 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం, పరీక్షలు రాసేందుకు డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



హోప్ ఉన్నత పాఠశాలలో పరీక్ష గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

నేటి నుంచి పదోతరగతి పరీక్షలు

రామసముద్రం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఎంఈఓ హేమలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 493 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

శంకర్‌పై వీఆర్ఎస్ఎస్ మండిపాటు

బి.కొత్తకోట: టీడీపీ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ వాల్మీకులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంపై వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి నేతలు తీవ్రంగా మండిపడ్డారు. కొన్ని రోజుల క్రితం టీడీపీ ఎస్టీసెల్ విభాగం నాయకులు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చారాదంటూ శంకర్ బ్యానర్లతో కలెక్టరేట్ ముట్టడించడంపై ఆదివారం వీఆర్ఎస్ఎస్ నాయకులు బి.కొత్తకోటలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పాదల నరసింహులు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని చంద్రబాబు, లోకేష్‌లు హామీ ఇస్తే..వ్యతిరేకిస్తూ శంకర్ ఫోటోతో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. శంకర్ ఈ చర్యను ఖండించి వాల్మీకుల ఎస్టీ జాబితాకు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించకపోతే ఈనెల 11న బి.కొత్తకోటలో వాల్మీకుల ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొగ్గిటి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, హరిబాబు, భరత్,సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుదేవర మహోత్సవం

తంబళ్లపల్లె: మండలంలోని ఆర్ఎన్‌తండా పంచాయతీ ఎద్దులవారికోటలో శ్రీపెద్దన్న గురుదేవర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎద్దులవారి ఇలుకాపులు ఉపవాసంతో గురుదేవర ఆలయ గర్భస్థలానికి నైవేద్యం సమర్పించారు. అలుగుకత్తిని నిలుపుదల చేశారు. దేవరెద్దు నియామకానికి మొదటి పూజగా ఈ గురుదేవర మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. శ్రీకృష్ణదేవరాయుల రచన యోధుడు పుస్తకాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు.



యోధుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పరామర్శ

కురబలకోట: మండల వైఎస్సార్ సీపీ నాయకుడు పిచ్చలవాండ్లపల్లె గ్రామం బోడేవాండ్లపల్లెకు చెందిన దయ్యాల వెంకట్రమణారెడ్డి (61) అంత్యక్రియల్లో ఆదివారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి పాల్గొన్నారు. అతని స్వగ్రామం వెళ్లి కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

బి.కొత్తకోటలో ఆర్ఎస్ఎస్ రూట్‌మార్చ్

బి.కొత్తకోట: ఏటా నిర్వహించే ఆర్ఎస్ఎస్ సమ్మేళన కార్యక్రమం ఆదివారం బి.కొత్తకోటలో జరిగింది. బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాలకు చెందిన 110 మంది కార్యకర్తలు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రాంత ఘోష్ ప్రముఖ్ సత్యనారాయణ దేశభక్తి, ప్రజల్లో జాతి సమైక్యతను పెంపొందించడం అంశాలపై ప్రసంగించారు. అనంతరం కార్యకర్తలు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, బైపాస్‌రోడ్డు, జ్యోతిచౌక్, దిగువబస్టాండ్, పీటీఎంరోడ్డు మీదుగా రూట్‌మార్చ్ నిర్వహించారు, కార్యక్రమాల్లో ఖండ సంఘచాలక్ సకలా ప్రభాకర్, విభాగ్‌సేవా ప్రముఖ్ కొండారెడ్డి, ఖండ కార్యవాహక్ రెడ్డెప్ప, జిల్లా సేవా ప్రముఖ్ సురేంద్ర, ఖండ శారీరక ప్రముఖ్ డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ఉజ్వల భవిష్యత్తు

కురబలకోట: విద్యార్థులు సమున్నత లక్ష్యంతో చదువుల్లో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అంగళ్లులోని విశ్వం విద్యా సంస్థల చైర్మన్ ప్రభాకర్ రెడ్డి కోరారు. శనివారం రాత్రి కళాశాలలో 16వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉజ్వల భవిష్యత్తుకు దారులు తెరచుకుంటాయన్నారు. అంది వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ రెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణ, ఓర్పు నేర్పుతో వివిధ సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాజ్యాంగ రక్షణ భేరిని విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : ఈ నెల 8న మదనపల్లెలో నిర్వహించనున్న రాజ్యాంగ రక్షణభేరి మహాసభను విజయవంతం చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాజ్యాంగ రక్షణ భేరి ప్రచార రథం పీలేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తమ కళావాహిని కళాబృందంచే భారత రాజ్యాంగంపై జరుగుతున్న కుట్రలపై ఆట, మాట, పాట రూపంలో ప్రజలకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముల్లంగి కృష్ణయ్య, ఎర్రబెల్లి మల్లిఖార్జున, మహేష్, మల్లేష్, బాబు, గిరి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

కలికిరి: విశ్రాంత ఉద్యోగులందరూ ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.ఆదినారాయణ రెడ్డి, సురేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో సంఘం సమావేశం నిర్వహించి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అలాగే వచ్చే నెలలో విశ్రాంత ఉద్యోగుల మాస్టర్ హెల్త్ చెకప్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుబ్బరాజ శెట్టి, డి.నారాయణ, సత్యనారాయణరావు, సరోజమ్మ, కాంతమ్మ, నారాయణ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.